# నిన్నటి మెరుపు-రేపటి నక్షత్రం

పక్కింట్లో గోల మొదలయింది.

వాళ్ళు మా పక్క భాగంలో అద్దెకు దిగిన ఈ పదిహేను రోజుల్లో ఈలాంటి గోల జరగటం ఇది ఏ పదోసారో అయివుంటుంది... అరుపులు, కేకలు, ఏడుపులు, పెడబొబ్బలు... మధ్యమధ్యలో ఆ మొగుడూ పెళ్ళాలు- పిల్లల్ని అదిలిస్తున్నట్లుగా ఉరుములు...

ఊరిబయట ఇల్లయితే ప్రశాంతంగా వుంటుంది, అద్దె చౌక, హైటెక్ సిటీకి పదిహేను నిముషాలల్లో కారులో వెళ్ళవచ్చు అని ఆయన ప్రత్యేకంగా ఈ ఇల్లును ఎన్నుకొని అద్దెకు తీసుకున్నారు సంవత్సరం క్రితం. నాకూ బాగా నచ్చింది. ఇంటి చుట్టూ కావాల్సినంత ఖాళీ స్థలం... నాకిష్టమయిన ఎన్ని పూలమొక్కలనయినా పెట్టుకోవచ్చు...

అనుకోకుండా మా ఇంటి యజమానికి మరో ఊరు బదిలీ అవ్వటంతో, వెళుతూ వెళుతూ, అంతవరకూ తామున్న భాగాన్ని వీళ్ళకు అద్దెకిచ్చి వెళ్ళారు. మొగుడు పెళ్ళాం, ఇద్దరు ఆడపిల్లలు. చిన్న సంసారం. బాగుంటుంది, నాకూ కాలక్షేపంగానే వుంటుందీ అనుకున్నాను. కానీ అనుకున్నదొకటీ, అయింది ఒకటీ అన్నట్లుగా ఆ కుటుంబంలో రోజూ రామరావణ యుద్ధమే...

ఆ పోరాటంలో ఎప్పుడూ ఓడిపోయినట్లుగా ఏడ్చేది పెద్ద కూతురు శకుంతలే! ఆ ఇంట అందరూ కలసి ఆ అమ్మాయిని కొడతారేమోననేది కూడా నా అనుమానం. తారాస్థాయిలో గొంతు మాత్రం వినబడేది చిన్న కూతురు సౌమ్యది...

నాకు శకుంతలను చూస్తుంటే జాలివేస్తూంది.

- నా జీవితానికీ, ఆమె జీవితానికి సామ్యమేమైనా వున్నదా అనిపిస్తుంది ఒక్కొక్కసారి ఆ ఇంటి భాగవతం చూస్తుంటే!

శకుంతల చామనచాయ రంగులో వుంటుంది. అందగత్తె అనటానికి వీల్లేని మాట వాస్తవమే కాని, కాస్త ఆ లావుపాటి పెదాలకు చిరునవ్వు అంటించుకున్నా, వయస్సులో వున్న ఆడపిల్ల కాబట్టి ఫరవాలేదనే అనిపించేది. ముఖాన్ని కళగా వుంచుకోవటమే అయిష్టమన్నట్లుగా జిడ్డుగారే చెంపలను శుభ్రం చేసుకోవటానికి కూడా ప్రయత్నించదు. ఒంటిమీద మంచి గుడ్డలు కాని, తలకున్న ఒత్తయిన జుట్టును, అందంగా జడవేసుకోవటంగాని చేయదు. అదే ఫ్యాషనన్నట్లుగా నడినెత్తిన సన్యాసుల ముడిలా చుట్టేసుకుంటుంది.

ఇక చిన్నది టక్కులాడి. పూటకో డ్రస్సు. జుట్టు కత్తిరుంచుకొని, ఎగురుకుంటూ ఎత్తు మడమల చెప్పులతో ఇంట్లోకి బయటకు గజ్జల గుర్రంలా పరుగెడుతూనే వుంటుంది. అందమూ, వయస్సు కూడా ఆ అమ్మాయిని ఇట్టే ఎవరినైనా ఆకర్షించేలా చేస్తూంది. కాలేజీలో చదువుతున్నదల్లే వున్నది ఓ స్కూటీ మీద తెగ తిరుగుతుంటుంది.

రాత్రి ఎనిమిది గంటలు...

"ఇల్లు మారిపోదామమ్మా!" అన్నాడు మా పెద్దవాడు చైతన్య విసురుగా నేను కూర్చున్న చోటకు వచ్చి- ఇంటర్ రెండొవ సంవత్సరం చదువుతూ, ఎమ్‌సెట్‌కు తయారవుతున్నాడు. "ఈ గోల మనం భరించలేం... నాకు పరీక్షలు రెండు నెలల్లోకి వచ్చినయ్... మూడ్ చెడిపోతోంది ఏం చదువుదామన్నా!"

ఇక టెన్త్‌లో వున్న మా కూతురు సృజన అయితే- అక్కడ సీరియల్ మొదలవ్వటం ఆలస్యం- వెంటనే టేప్ రికార్డర్ ఆన్ చేసి, దానికిష్టమయిన పాటలేవో పెట్టుకొని, ఇయర్ ఫోన్ తగిలించేసుకొని ఊగిపోతుంటుంది, మరో ప్రపంచంలో కాలు పెడుతున్నట్లుగా. చదివినా, చదవకపోయినా ర్యాంక్ వస్తుందనేది దాని ప్రగాఢ విశ్వాసం.

పక్కింటి తుఫాను సర్దుమణుగుతున్నదనుకుంటుండగానే ఫోన్ గణగణా మ్రోగింది. ఆఫీసులో ఆలస్యమవుతుంది అని చెప్పటానికి ఆయనగారు చేసి వుంటారు.

ఈ మధ్య మరీ ఆలస్యమవుతోంది. జీతాలు బాగా ఇస్తారని పేరేగాని, ఈ సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు ఒక వేళాపాళా వుండదు. ఏ రోజూ రాత్రీ ఎనిమిదింటికి లోపు ఇంటికి రారు. ఒక సరదా లేదూ పాడూ లేదు.

ఫోనెత్తితే పిన్ని కంఠం వినబడింది చికాకు కలిగిస్తూ.

"చెప్పు, పిన్నీ!" అన్నాను నన్ను నేను నిగ్రహించుకుంటూ.

"శ్యామలను కాన్పుకు తీసుకు రావాలి... రెండు మూడు నెలలు ఇక్కడే వుంటుంది... ఆసుపత్రి ఖర్చులకు ఈసారీ నువ్వే పంపాలి... అది ఎన్నాళ్ళున్నా, నాన్న పోయిన తరువాత ఇస్తున్న సగం పెన్షన్ డబ్బులు, చిన్న భాగం ఇంటి అద్దె పై ఖర్చులకు సరిపోతయి!" అన్నది చిన్నగా.

"రెండో కాన్పుకు అత్తింటివారే ఖర్చుపెట్టటం ఆనవాయితీ కదా... నాకూ పురుడు మా అత్తగారే పోశారు!" అన్నాను విసుగ్గా.

"దాని అత్తగారింట్లో ఆ ఆచారం లేదట... రాత్రి వియ్యపురాలు ఫోను చేసి, దాని పురుడు ఖర్చులన్నీ, ఎన్నిసార్లయినా మనమే భరించాలన్నట్లు మాట్లాడింది!" అన్నది ఆమె కూడా కాస్తంత అసహనంగా.

"ఈసారి ఆపరేషన్ చేయించేయ్, పిన్నీ!" అన్నాను.

"అసలే బక్కది... ఏమౌతుందోనని భయంగా వున్నది... అయినా అల్లుడుగారు ఒప్పుకోవాలి గదా!" పిన్ని ఓ దీర్ఘం తీసింది.

– అసలు ఆమెకే ఇష్టం లేదు... ఏవేవో కారణాలు చెబుతుంది... కూతుర్ని తనే రమ్మనమని చెప్పివుంటుంది...

తనకంటే బక్కగా ఏమీ వుండదు శ్యామల. మీగడ పెరుగులు తిని పెళ్ళినాటికి బాగా నున్నగానే తేలింది. తనే వెన్న తీసిన మజ్జిగతో ఆ ఇంట రోజులు గడిపింది- సవితి తల్లి చేతి క్రింద పెరగటమంటే అంతేకదా మరి!

తన అదృష్టమంతా తన తల్లితోనే కనుమరుగయింది. ఒక రోజు తనూ అన్నంలో పెరుగు వేయమని గోల చేస్తే పిన్ని కొట్టినంత పనిచేసి, "అది చదువుకుంటున్న పిల్ల... నువ్వు ఇంట్లో పడివుండేదానివి... నీకెందుకు?" అంటూ ఒక్క కసురు కసిరింది.

పక్కనే కూర్చొని భోజనం చేస్తున్న నాన్నా మాట్లాడలేదు. ముఖం పక్కకు తిప్పుకోవటం తప్ప ఆయనకు చేయగలిగిందేమీ లేదని తనకా క్షణాన తెలియదు!

అది తెలిసే వయస్సు వచ్చేటప్పటికి తనకు పిన్ని మాటలు, చేష్టలు అలవాటు అయిపోయినయి.

తరువాత ఎన్నడూ తనకు దేనిమీద ఎంత ఇచ్ఛ ఏర్పడినా ఆమెంతటఆమె ఇస్తేనేగాని తను తీసుకోలేదు!

"చూద్దాంలే... ఆయన ఆఫీసునుంచి ఇంకా ఇంటికి రాలేదు. ఈ నెలలోనే మా మరదలుకు సీమంతమంటూ అత్తయ్య నిన్ననే ఫోన్ చేసింది!"

"నువ్వు కాదన ఒద్దమ్మా! అబ్బాయికి ఎలా అయినా నచ్చ చెప్పాలి... నీ చెల్లెలు కుటుంబంలో ఎలాంటి పొరపొచ్చాలు వచ్చినా బాధ పడేది నువ్వూ, నేనే కదా!"

కోపం చర్రున వచ్చింది. "ప్రయత్నిస్తాలే!" కావాలని ఫోను పెట్టేశాను.

అయినా నేనెందుకు బాధ పడాలి?... ఇప్పుడు అవసరం వచ్చింది కాబట్టి అది నాకు చెల్లెలయిందా?...

❖ ❖ ❖

మధ్యాహ్నం మూడు గంటలప్పుడు తలుపు తట్టిన శబ్దమయితే వెళ్ళి తీశాను. ఎండ మండిపోతోంది.

ఎదురుగా పక్కభాగంలోకి కొత్తగా వచ్చిన వాళ్ళ పెద్దకూతురు.

"రా, అమ్మా!" అన్నాను.

"అమ్మకు బాగా తలనొప్పిగా వున్నదట... మాత్రేమైనా వుంటే ఇప్పించుకు రమ్మనమన్నది... తెద్దామంటే దగ్గర్లో మందుల షాపులు లేవు... చెల్లాయి కాలేజీనుంచి వచ్చిం తరువాత స్కూటీమీద వెళ్ళి తీసుకు వస్తుంది!" అన్నది ఆ అమ్మాయి తలవంచుకొని సిగ్గుపడుతున్నట్లుగా.

ఇది పది రోజుల క్రితం నాటి మాట. అప్పటికి వాళ్ళు ఆ భాగంలో దిగి రెండు రోజులయిందేమో. అదే మొదటిసారి ఆ ఇంట్లో వాళ్ళతో మాట్లాడటం. అంతకు ముందు మాట్లాడే అవకాశం దొరకనే లేదు. తలుపులు వేసుకొని సామాన్లు సర్దుకోవటంతోటే సరిపోతున్నట్లున్నది వాళ్ళకు.

"నీ పేరేంటమ్మా, రా... కూర్చో!" అన్నాను.

"శకుంతల!" కూర్చోకుండానే అన్నది.

"చెల్లాయి పేరు?"

"సౌమ్య!"

"నీకు కాలేజీ లేదా?"

"లేదాంటీ... అమ్మకు అంతగా ఆరోగ్యం బాగుండదు... నేనూ, చెల్లాయి ఇద్దరం బయటకు వెళితే అమ్మ ఇంటి పనంతా చేసుకోలేదు!" తలెత్తకుండానే చెప్పింది.

జాలేసింది ఆ అమ్మాయిని చూస్తుంటే. ఇరవై పైనే వుంటుంది వయస్సు. ఒక్కొక్కరి జీవితాలు అంతే మరి!

క్రోసిన్ వుంటే ఇచ్చాను. తీసుకొని 'థాంక్స్' చెప్పి వెళ్ళిపోయింది.

శకుంతల నలుపయినా పోషణ వుంటే బాగానే వుంటుందనిపించింది. నేనూ ఇలాగే ఇరవై నాలుగు గంటలూ ఇంటి చాకిరి చేస్తూ చదువుకోకుండా వుండిపోయాను... అనారోగ్యమంటూ, తెచ్చిపెట్టుకున్న రోగంతో పిన్ని మంచం దిగేది గాదు... ఆమెకూ, ఆమె కూతురికీ రాజభోగాలు నేను చూడవలసి వచ్చేది!

సరిగ్గా శకుంతలకున్న వయస్సులోనే నా జీవితం ఓ మలుపు తిరిగింది...

టాస్ వేశాను. బొమ్మ పడితే ఓ వెలుగు వెలగవచ్చు. బొరుసు పడిందా ఉన్నదానికి మించి నష్టపోయేదేమీ లేదు. ఏ ఆనందమూ లేకుండా యంత్రంలా గడుపుతున్న నా జీవితంలో అది ఓ ప్రయోగమే!... సవితి తల్లి చేతిలో చివాట్లూ, చెప్పు దెబ్బలతో హీనపు బ్రతుకు బ్రతికేదానికంటే కాస్తంత రిస్క్ తీసుకోవటమే మంచిదనిపించింది.

అందుకు అవకాశం మా పక్కింట్లో వున్న రాంబాబు రూపంలో వచ్చింది.

నేనంటే ఆసక్తి చూపుతూ, నా వంక దొంగ చూపులు చూస్తూ, నాకోసమే తహతహ లాడుతున్నట్లనిపించిన అతడికి నా చిరునవ్వులతో చొరవ చూపించాను!

బొమ్మే పడింది!

నేను చదువులేని దాన్నని తెలిసినా, నా అందాన్ని చూచి ఆయనగారు వెనక్కు తగ్గకపోగా, ముందుకు దూకి నన్ను వివాహం చేసుకోవటంతో, నేను ఒక్కసారిగా స్వేచ్ఛా వాయువులు పీల్చే విహంగాన్నే అయి ఆయన ఒళ్ళో వాలిపోయాను. ఇక నేను వెనక్కు తిరిగి చూచుకున్నదే లేదు. తరువాత ఆయన సాఫ్ట్‌వేర్ ఇంజనీరు అవ్వటం, రెండు చేతులా సంపాదిస్తూ నన్ను అందలం ఎక్కించటంతో నేను స్వయం కృషితో రత్నఖచిత సింహాసనాన్నే అధిష్టించినట్లుగా ఆనందించాను.... ఆయన ప్రోద్బలంతో, ప్రోత్సాహంతో ప్రైవేట్‌గా చదివి ఎమ్మే పట్టా పొందగలిగానూ అంటే నా జీవితం ఎంతగా ఊహించని రీతిలో మారిపోయిందో నాకే ఆశ్చర్యమేస్తుంది.

మా పిన్ని మా పెళ్ళి చెడగొట్టటానికి అన్ని విధాలా ప్రయిత్నించింది. నా పెళ్ళయితే ఆమెకు జీతం భత్యంలేని సేవకురాలు లేకుండా పోతుందనేదే ఆమె బెంగ అని నాకు తెలుసు.

ఇది జరిగి పదిహేను సంవత్సరాలయింది!

✣ ✣ ✣

ఒక్కసారిగా కెవ్వుమన్న కేక... పక్క భాగం తలుపు తెరుచుకున్న శబ్దం...

మా వాకిటి తలుపు తీసి వుండటంతో ఆ ఇంట్లోని శబ్దాలన్నీ స్పష్టంగా వినబడుతున్నాయి.

అంతకు రెండు నిముషాల క్రితమే ఆయన ఆఫీసునుంచి వచ్చి, సోఫాలో కూర్చొని, నేనిచ్చిన మంచినీళ్ళు త్రాగి బూట్లు విప్పుకుంటున్నారు.

బయటనుంచి శకుంతల ఏడుపు, లోపలనుండి కేకలు...

మా భాగం తలుపులు మూసేద్దామన్నట్లుగా వాకిటి వైపుకు రెండడుగులు వేశాను. ఈలోగానే చైతన్య విసురుగా తన గదిలోనుంచి బయటకు వచ్చాడు. "నాన్నా! నువ్వు వెంటనే మరో ఇల్లు చూడాలి... నాకిక్కడ చదువు సాగటంలేదు... ఈ గోలతో నా బుర్ర తిరిగిపోతోంది... రేపు ర్యాంక్ రాకపోతే నన్ను మాత్రం అనవద్దు!" గొంతు పెద్దది చేసి అరుస్తున్నాడు.

నేను సైగ చేశాను మాట్లాడవద్దన్నట్లుగా. "పొద్దుటినుంచి ఆఫీసులో కష్టపడి ఇప్పుడే కదరా నాన్న ఇంటికి వచ్చింది... ఆలోచిద్దాంలే!" అన్నాను చిన్నగా.

వాడు కోపంగా నా వంక ఒకసారి చూసి, తన గదిలోకి వెళ్ళి భళ్ళున తలుపు వేసేసుకున్నాడు.

మా అమ్మాయి అదృష్టవంతురాలు- టీవీ సౌండ్ పెంచేసింది పక్కింట్లో భాగవతం మొదలవ్వటం ఆలస్యం.

నేనే తలుపు మూయబోతున్నదాన్నల్లా, ఏమయిందా అనుకుంటూ, గడపవతలకు కాలు వేశాను.

శకుంతల మా రెండు తలుపులకూ నడుమ చీకట్లో నిలబడివున్నది. వాళ్ళ తలుపు దగ్గర సౌమ్య నిలబడి అక్కను చేయూపుతూ బెదిరిస్తోంది.

నన్ను చూస్తూనే, "చూడాంటీ! మా పరీక్షలు రెండ్రోజుల్లోకి వచ్చినయి... కాస్త టీ పెట్టమంటే పాలు లేవంటోంది... పరీక్షలని తెలుసుగదా పాలుంచాలనే జ్ఞానం వుండనక్కరలేదా దానికి... అంత వయస్సు వచ్చింది... నేను చదువుకుంటున్నానని, ఎక్కడ బాగుపడతానోనని కుళ్ళి చస్తోంది... రాక్షసి!" గొంతు పెంచి అరవసాగింది.

ఆ మాటలకు నా మనస్సంతా బాధతో మెలికలు తిరిగిపోయింది. సౌమ్య మాత్రం చిన్నపిల్లా? కాలేజీలో చదువుతున్నది. తనకు కావాల్సిన ఏర్పాట్లేవో తను చూసుకోలేదా? ఇంట్లో అద్దమైన చాకిరీ చేసే ఈమే ఆమెకు టీ నీళ్ళు కాచి పోయాలా... బుద్ధిలేకపోతేసరి!...

కానీ ఇందులో నేను కల్పించుకుంటే నా చేతులే కాలతయ్యని నాకు తెలుసు... అందుకనే మౌనంగా శకుంతలనే చూస్తూ బాధ పడటం తప్పా చేయగలిగిందేమీ లేదు... బురదమీద రాయి వేస్తే మన ముఖానే చిందుతుంది...

"మా ఇంట్లో పాలున్నయిగాని, నేనిస్తా రా, అమ్మా!" అన్నాను శకుంతల చేయి పట్టుకొని అనునయంగా.

"నేనూ అదే చెబుతున్నాను ఆంటీ!.... ఆంటీని అడిగి కాసిని తీసుకు వస్తే, రేప్పొద్దున పాలు రాగానే తిరిగి ఇచ్చి వేయవచ్చు అని... పగలంతా కబుర్లు చెబుతూ మీ ఇంట్లోనే కూర్చుంటూ వుంటుంది కదా... అవసరానికి మాత్రం బెట్టుసరి!" ఈసడింపుగా చేతిని ఒక్క విదిలింపు విదలించి లోపలకు వెళ్ళిపోయింది.

నేను ఉలిక్కిపడ్డాను ఆ అమ్మాయి మాటలకు... చివరకు నామీద కూడా విసుర్లు విసురుతున్నదన్నమాట... నా దగ్గర కూర్చోబెట్టుకొని ఆ అమ్మాయికి నేనేవో హితబోధలు చేస్తున్నట్లుగా అనుమానించటం లేదు కదా!

లోపలనుంచి తండ్రి కేకలూ వినబడుతున్నయి కాని... అవి పెద్ద కూతురు మీదనో, చిన్న కూతురు మీదనో అర్థం కావటం లేదు... కాకపోతే లోకువగా పడివుండే పెళ్ళాం మీదనయినా అయివుండవచ్చు!

నేను గ్లాసులో కాసిని కాగపెట్టిన పాలు పోసి తెచ్చి శకుంతలకు ఇచ్చాను... దగ్గరనుంచి చూస్తే ఆ అమ్మాయి నల్లటి చెంపల మీద అయిదు వేళ్ళ ముద్రలూ స్పష్టంగా కనబడుతున్నాయి...

కంగారుగా అడిగాను. "సౌమ్య కొట్టిందా?"

"కాదు... ఆ రాక్షసుడే కొట్టాడు!"

హతాశురాలినయ్యాను... కూతురు తండ్రినే రాక్షసుడు అంటున్నదంటే ఆమె ఎంతగా విసిగిపోయిందో జీవితం మీద, వాళ్ళమీద...

భగవంతుడు అంత నిర్దయుడా?...

✣ ✣ ✣

శకుంతల లోపలకు వస్తుండగానే తలుపు దగ్గరకు వేశాను.

అరగంట క్రితం పిన్ని ఫోను చేసింది, "రేపు చెల్లాయి వస్తున్నది... డబ్బు విషయం అబ్బాయితో చెప్పావా?" అంటూ.

"చూద్దాంలే... ఎంతో కొంత పంపిస్తాలే!" అన్నాను ఆఖరకు ఫోను పెట్టేస్తూ, ఇక తప్పదని తెలిసి.

శకుంతల భుజాల మీద చేతులు వేసి ఆప్యాయంగా దగ్గరకు తీసుకున్నాను. ఆ అమ్మాయి అంటే నాకు అమితమైన జాలివేస్తోంది.

ఆ అమ్మాయి కళ్ళు ఏడ్చి ఏడ్చి మంకెన పువ్వుల్లా ఎర్రగా నెత్తురు చిమ్ముతున్నాయి. మళ్ళా ఆ ఇంట ఏదో గొడవ జరిగిందన్నమాట!

పిల్లలు కాలేజీలకు వెళ్ళారు. పన్నెండు గంటలయింది. విశ్రాంతిగా కూర్చున్నాను.

"నిన్ను చూస్తుంటే నా గడిచిన రోజులే గుర్తుకు వస్తున్నాయి, శకుంతలా!... మా ఇంట నేను ఎన్ని ఇబ్బందులు పడ్డానో నీకు ఇంతకు ముందే చెప్పాను...." ఆ అమ్మాయి మనస్సును మార్చి సరయిన దారిలో పెట్టకపోతే ఆ అమ్మాయికి ఆ చెరసాలనుండి విముక్తి లభించదు. అందుకే ఆ అమ్మాయి ఒంటరిగా నాకు దొరికినప్పుడల్లా నాకు తోచిన హిత వచనాలు చెబుతూనే వున్నాను.

"నేను ఈనాడు హాయిగా బ్రతక గలుగుతున్నాను అంటే ఆనాడు నేను చూపిన చొరవే... మనల్ని ఎవరో వచ్చి రక్షిస్తారు అనుకుంటూ కూర్చుంటే మనకు ఇలాగే తెల్లవారి పోతుంది... మనమే ఆలోచించి, ఎవరు ఏమనుకున్నా సరే, ముందుకు అడుగు వేసి, మనంతట మనమే దీపం వెలిగించుకొని, మనని చుట్టివేసిన చీకటిని తొలగించుకోవాలి!"

నా వంక కళ్ళార్పకుండా చూడటమే తప్పా నోరు తెరవదు... ఎలాగయినా ఆ అమ్మాయిని ఓ దరికి జేర్చాలి. గడిచిపోయిన దానికంటే భవిష్యత్తే ఎక్కువ వున్న ఆమె జీవితం ఇప్పటికయినా వెలుగు చూడాలి!

"నీకు నచ్చినవాడిని నువ్వే ఎన్నుకొని, వివాహం చేసుకొని, వీలయినంత తొందరగా ఈ ఇంటినుండి బయటపడు... ఎలాంటి అవకాశం దొరికినా వదులుకునే పిచ్చిపని మాత్రం చేయబోకు!" నా కంఠం అంత దృఢంగా వుండటం నాకే ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది.

శకుంతల ఏదో చెప్పటానికి సంశయిస్తున్నట్లు నా ముఖంలోకే చూస్తూ వుండిపోయింది.

"చెప్పు... ఏమీ భయంలేదు.... నువ్వు మనస్సు విప్పి మాట్లాడితే నేను చేయగలిగిన సాయం చేస్తాను!"

ఆ అమ్మాయి నోరు తెరిచింది. "మా మామయ్య కొడుక్కు నన్ను చేసుకోవాలనే కోరిక ఉన్నమాట వాస్తవమేగాని, నేనే అంగీకరించలేదు... నా పరిస్థితి అది మరి!" అన్నది తలవంచుకొని కళ్ళు మూసుకుంటూ.

"ఎంత పిచ్చి పని చేశావ్, శకుంతలా!... నీ జీవితాన్ని నీ చేతులతోనే నరుక్కుంటున్నా వన్నమాట! ఇప్పటికయినా నిన్ను నువ్వు తెలుసుకొని ముందడుగు వేయి!" అన్నాను ఆ అమ్మాయి వంక జాలిగా చూస్తూ.

శకుంతల బొమ్మలా కూర్చున్నది.

"నేనూ నీకు లాగానే అప్పుడు వెనుకంజవేసి, ఆ ఇంట్లోనే సవితి తల్లి చెప్పు చేతల్లోనూ, ఆవిడగారి కూతురు చేతుల్లోనూ బందీగా పడి వున్నట్లయితే నా బ్రతుకు ఎంత దుర్భరంగా వుండేదో ఊహించుకుంటేనే నా ఒళ్ళు గగుర్పొడుస్తుంది... ఆలాంటి వాళ్ళే ఇప్పుడు నా డబ్బు చూసి నాకు దగ్గరవ్వాలని చూస్తున్నారు... నా సాయం కోసం వెంపర్లాడుతున్నారు... అందుకే నేనానాడు చేసిన పనిని నువ్వు ఇప్పుడు చేయక తప్పదు... మీ మామయ్య కొడుకు వివరాలు నాకు చెప్పు... అంకుల్‌ని పంపి పిలిపించి మాట్లాడతాను!"

శకుంతల తల వంచుకున్నది. ఆమె ఎర్రటి కళ్ళల్లోనుంచి నీరు ఉబికి వస్తోంది.

"మీకూ, నాకూ చాలా తేడా వున్నది ఆంటీ!..." ఆమె చెప్పాలనుకున్నదేదో చెప్పలేక గొంతు బిగుసుకుపోతున్నదా అన్నట్లుగా చేయెత్తి మెడచుట్టూ రుద్దుకోసాగింది. "మీలాగా కాదు ఆంటీ... మీరనుకుంటున్నట్లుగా మా అమ్మ నాకు సవితి తల్లికాదు...!" ఆ మాటలు చెబుతున్నప్పుడు ఆమె ముఖం మరింతగా నల్లబడిపోయింది.

ఆమె చేతి వేళ్ళలో చిరు కంపన.

"మరి?" వింతగా గుడ్లప్పగించి ఆ అమ్మాయి వంకే చూస్తున్నాను.

"శ్యామలా నేనూ ఒక తల్లి బిడ్డలమే కానీ... కానీ... ఒక తండ్రి బిడ్డలం కాదు... మా అమ్మకు నా ఆసరా ఏమాత్రం లేకపోయినా ఆ రాక్షసులిద్దరూ కలిసి ఆమెను మరింత చిత్రహింసలు పెడతారు... నేను ఆ ఇంటినుండి బయటకు వెళ్ళటమంటే ఆమెను చేజేతులా చంపుకోవటమే!" రెండు చేతుల్లోనూ ముఖాన్ని దాచుకుంటూ ముందుకు వాలిపోయింది.

నా గుండె శకుంతల మాటలకు చిక్కబట్టినట్లవ్వగా బిగుసుకుపోయాను.

శకుంతల మాటల్లోని భావం నన్ను ఉక్కిరిబిక్కిరి చేసింది...

నా వివాహమయిన కొద్దిరోజులకే నాన్న మరణించటం...???

ఆ గృహంలో నాతో సమానంగా క్షోభ పడిన నాన్న కోసం నేనేం చేశాను? నా సౌఖ్యాన్ని నేను చూసుకొని, నా భవిష్యత్తును ఆనందంగా తీర్చిదిద్దుకునేందుకు, ఆయన్ను ఒంటరిగా వాళ్ళ నడుమ బలిపశువుగా వదిలేసి పారిపోయి వచ్చానా?.

నా ముందు కూలబడి ఎంతో బాధతో ఏడుస్తున్న శకుంతల నాకు ఓ మహోన్నత శిఖరంలా కనబడగా, నేను ఆమె ముందు ఓ అల్పజీవిలా కుంచించుకుపోయాను!

*(ఆంధ్రభూమి: దినపత్రిక: 23.05.2009)*